ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 19.06.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. అభివృద్ధికి రహదారుల నెట్‌వర్క్ ఎంతో కీలకమని , కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
2. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో , ధాన్యం నిల్వ లను ఏర్పాటు చేసే ప్రక్రియ పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.
3. హైదరాబాద్ హైటెక్స్ లో నిర్వహిస్తున్న కన్ స్ట్రక్షన్ ఎక్విప్మెంట్ ఎగ్జిబిషన్ – అమృత్ ను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఈ ఉదయం ప్రారంభించారు.
4. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ సాయంత్రం హైదరాబాద్, ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు.

**కిషన్ మహేశ్వరం**

అభివృద్ధికి రోడ్ల నెట్‌వర్క్ ఎంతో కీలకమని , కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఈ ఉదయం కేంద్ర మంత్రి పర్యటించారు. మహేశ్వరం , ఇబ్రహీం పట్నం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో 87 కోట్ల రూపాయల విలువైన రోడ్ల అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు , భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి కిషన్ రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెస్క్

**ఉత్తమ్**

తెలంగాణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ధాన్యం నిల్వ ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 జిల్లాల్లో సైలో టెర్మినల్స్ ఏర్పాటు ప్రతిపాదనలపై ఏజెన్సీలతో చర్చించారు. వర్షాలు , ప్రకృతి వైపరీత్యాల ప్రభావం లేకుండా 47.5 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 82 సైలో టెర్మినల్స్ నిర్మించాలని, దీనికి సుమారు 4 వేల 450 కోట్ల పెట్టుబడి అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. పౌర సరఫరాల శాఖను దేశంలోనే ఆదర్శ ధాన్య నిర్వహణ వ్యవస్థగా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

డెస్క్

**సీతక్క**

హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న కన్ స్ట్రక్షన్ ఎక్విప్మెంట్ ఎగ్జిబిషన్ – అమృత్ ను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఈ ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ … హైదరాబాద్‌లో ఇలాంటి భారీ ఎగ్జిబిషన్ నిర్వహించడం సంతోషకరమని అన్నారు. నిర్మాణ రంగానికి అవసరమైన అత్యాధునిక యంత్ర పరికరాలను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని చెప్పారు.

డెస్క్

**కిట్స్**

రాష్ట్రంలోని సర్కారు పాఠశాలలు , సంక్షేమ గురుకులాలు , కస్తూర్బా విద్యాలయాలు , వసతిగృహాల విద్యార్థులకు యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్‌ల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం నేడు శ్రీకారం చుట్టనుంది. హైదరాబాద్ లోని ఎల్.బి. స్టేడియంలో నిర్వహించనున్న

ఈ కార్యక్రమంలో గురుకుల విద్యార్థులకు 22 , పాఠశాల విద్యార్థులకు 7 , వసతిగృహ విద్యార్థులకు 10 వస్తువులతో కూడిన కిట్లను గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తారు.

డెస్క్

**వికసిత్**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' పథకం కింద దేశ వ్యాప్తంగా ఉపాధి కల్పన , కార్మికులకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జాతీయ స్థాయి ఇన్సెంటివ్‌ల పంపిణీ కార్యక్రమం ఈరోజు జరగనుంది. ఇందులో భాగంగా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ సాయంత్రం 5 గంటలకు నల్లకుంటలోని ఆర్టీసీ కళాభవన్‌లో ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నారు. కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

PN

**భట్టి విక్రమార్క**

మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంతోపాటు జిల్లా కేంద్రాల్లో ఉర్దూ కవి సమ్మేళనాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో 20 మైనార్టీ గురుకులాల భవన నిర్మాణాలు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. సచివాలయంలో మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు.

డెస్క్

**లేఖ**

రాష్ట్రంలో చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయిస్తూ ఆదేశాలు జారీ చేయాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. దీనివల్ల

వేల మంది చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుపడటమే కాకుండా ప్రభుత్వ సంస్థలకు నాణ్యమైన చేనేత ఉత్పత్తుల సరఫరా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి సురేఖ లేఖ రాశారు.

డెస్క్

**నషాముక్త భారత్**

మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజమంతా భాగస్వాములు కావాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు "నషా ముక్త భారత్ అభియాన్" లో భాగంగా హనుమకొండ జిల్లాలో నేటి నుంచి 25 వరకు "నషా ముక్త సప్తాహం"ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పిటిసి, వరంగల్

**కౌన్సిలింగ్**

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశానికి కౌన్సెలింగ్ ప్రక్రియ ఈరోజు నుంచి ప్రారంభం అవుతోంది. విద్యార్థులు ఈరోజు నుంచి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. 22వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా 37 హెల్ప్ లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

డెస్క్

**బంద్**

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్ , అనుబంధ ఆన్‌లైన్ సేవలకు సంబంధించి సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 26 , 27, 28 తేదీల్లో సేవలు నిలిపివేయనున్నట్లు శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. సర్వర్ నిర్వహణ ప్రక్రియ, ఆన్‌లైన్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేసేలా , భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం, సేవల్లో నాణ్యత మెరుగుపర్చడం కోసం ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

డెస్క్

**వాతావరణం**

రాష్ట్రంలో నిన్న సాయంత్రం పలు జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో కూడా రాత్రి వేళ వర్షం కురిసింది. మరోవైపు పగటిపూట వడగాలులు రాష్ట్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నిన్న 146 మండలాల్లో వడగాలుల ప్రభావం కనిపించింది. ఈరోజు, రేపు ఆదిలాబాద్ , నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్ సహా 13 జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరికొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సూచనలున్నాయి.

పీఎన్

**రంగనాథ్**

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో చెరువుల పరిరక్షణలో భాగంగా మొత్తం 24 చెరువుల పునరుద్ధరణ పనులను ముమ్మరం చేశామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని రామంతాపూర్ పెద్ద చెరువు పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ...

బైట్ - రంగనాథ్

పిటిసి, మేడ్చల్

**యోగా సంగారెడ్డి**

పోటీ ప్రపంచలో మెరుగైన జీవన విధానానికి యోగా తప్పనిసరి అని సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రముఖ యోగా గురువులు జగన్ తెలిపారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

బైట్ - జగన్

పిటిసి, సంగారెడ్డి

**ఆరోగ్యం**

ఆరోగ్య సమస్యలు వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే , ముందే జాగ్రత్త పడటం మంచిదని ఆ జాగ్రత్తల్లో యోగా ఒక ముఖ్యమైన భాగమని పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ అన్నారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

బైట్ - శ్రీధర్

పిటసి, పెద్దపల్లి

**బైట్**

రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని జమ్మికుంట కృషి విజ్ఞాన శాస్త్రవేత్త మహేష్ అన్నారు. వరి వేసే వారు స్వల్ప కాలిక వరి సాగు చేయాలని ఆకాశవాణి తో మాట్లాడుతూ చెప్పారు.

బైట్ ... మహేష్, శాస్త్రవేత్త, కెవికె, జమ్మికుంట

పిటిసి, కరీంనగర్

**కవిత**

యూరియా బస్తాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ పనిచేయడం లేదని, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జెండా పండుగలో పాల్గొని మాట్లాడారు.

బైట్ - కవిత

కల్తీ పానీపూరీ తిని అనారోగ్యానికి గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని నిన్న రాత్రి కవిత పరామర్శించారు.

పిటిసి, సిరిసిల్ల

**జాతీయ పఠన దినోత్సవం**

దేశంలో ఈరోజు జాతీయ పఠన దినోత్సవం జరుపుకుంటున్నారు. గ్రంథాలయ , అక్షరాస్యత ఉద్యమ పితామహుడు అయిన పి.ఎన్. పణికర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రభుత్వం 1996లో అధికారికంగా ఈ దినోత్సవాన్ని ప్రకటించింది.

జీఎస్

**విప్**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేసీఆర్ నగర్ లో   పానీపూరి తిని అస్వస్థతకు గురై జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు .

పిటిసి, సిరిసిల్ల

**కరాటే శిక్షకుల నుండి దరఖాస్తుల ఆహ్వానం**

ఆసిఫాబాద్ జిల్లాలోని 10 పీఎంశ్రీ పాఠశాలల్లో కరాటే నేర్పించడానికి బ్లాక్ బెల్ట్ కలిగిన శిక్షకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి సచ్చిదనంద చారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పిటిసి, ఆసిఫాబాద్